సాక్షి
ఒడిశా

సోమవారం । 14 । ఆగస్టు । 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలక వర్గం ఆదివారం లెక్కించారు. ఇందులో నగదు రూ.12,40,626లు వచ్చాయని అధికారులు తెలిపారు.



యువకుడు దుర్మరణం

గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ యువకుడు దుర్మరణం చెందాడు. దీంతో గ్రామస్తులు, బంధువులు రాస్తారోకో చేపట్టారు. డ్రైవర్‌ను అరెస్టు నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

- 8లో



విజ్ఞాన ప్రదర్శన

సరస్వతి శిశు విద్యామందిర్ ఆధ్వర్యంలో విజ్ఞాన ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. పలు పాఠశాలల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

- 8లో

వేడుకలకు సన్నాహాలు..!



పోలీసుల కవాతు



ఎగ్జిబిషన్ గ్రౌండులో రిహార్సల్

- ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో ఫైనల్ డ్రెస్ రిహార్సల్
- నగర వ్యాప్తంగా వాహనాల తనిఖీ

భువనేశ్వర్:

రాష్ట్ర స్థాయి స్వాతంత్ర దినోత్సవ వేడుకల నిర్వహణకు నగరం ముస్తాబవుతోంది. సన్నాహాలు దాదాపు తుది దశకు చేరుకున్నాయి. స్థానిక యూనిట్ - 3 ఎగ్జిబిషన్ గ్రౌండు ప్రాంగణంలో జరిగే ఈ వేడుకల్లో ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ ముఖ్య అతిథిగా పాల్గొని జాతీయ పతాకం ఆవిష్కరిస్తారు. ఆగస్టు 15న జరిగే పెరేడ్ కోసం తుది సాధన ఆదివారంతో ముగిసింది. డీజీపీ సునీల్ కుమార్ బన్సాల్, కటక్ - భువనేశ్వర్ జంట నగరాల పోలీస్ కమిషనర్ సౌమేంద్ర ప్రియదర్శి, భువనేశ్వర్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ ప్రతీక్ సింగ్ పర్యవేక్షించారు. డ్రెస్ రిహార్సల్‌లో పొరుగు రాష్ట్రం ఛత్తీస్‌గఢ్‌కు చెందిన బృందంతో 5 వర్గాలు, పోలీసు బ్యాండ్ జట్లు పాల్గొన్నాయి.

భారీ భద్రతా ఏర్పాట్లు: డీజీపీ

స్వాతంత్ర్య వేడుకలు పురస్కరించుకుని నగరంతో పాటు జిల్లాల్లో ప్రధాన మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో భారీ భద్రతా ఏర్పాట్లు చేసినట్లు డీజీపీ సునీల్ కుమార్ బన్సాల్ తెలిపారు. 15 ప్లటూన్ల పోలీసులను మోహరించి ట్రాఫిక్ నిర్వహణ పటిష్ట పరిచినట్లు చెప్పారు. వేడుకల ఆద్యంతం సందర్శకులకు పూర్తి భద్రత కల్పించేందుకు అత్యంత ప్రాధాన్యమిస్తున్నట్లు జంట నగరాల పోలీసు కమిషనర్ సౌమేంద్ర ప్రియదర్శి తెలిపారు. మూడంచెల భద్రతా వలయం పరిధిలో ఈ ఏడాది స్వాతంత్ర వేడుకలకు ఏర్పాట్లు చేసినట్లు ఆయన వివరించారు.

బ్లాకింగ్.. చెకింగ్ ముమ్మరం

వేడుకల నేపథ్యంలో ఎటువంటి నగరంలో శాంతిభద్రతల వ్యవస్థను పటిష్టపరిచారు. నగరం నలువైపులా ప్రవేశ మార్గాల్లో తనిఖీలు ముమ్మరం చేశారు. అపరిచిత, సందిగ్ధ వాహనాలు యథేచ్ఛగా నగరంలోనికి చొరబడకుండా అవసరమైన చోట్ల బ్లాకింగ్ వ్యవస్థ ఏర్పాటు చేశారు. నగరవ్యాప్తంగా ప్రధాన కూడలి ప్రాంతాల్లో ఈ చర్యలు చేపడుతున్నారు. ఏజీ ఛక్, రాజ మహల్ ఛక్, మాస్టరు క్యాంటీన్, ఎయిర్ పోర్టు కూడలి, ఓయూఏటీ ఛక్, రూపాలి జంక్షన్, కల్పన స్క్వేర్, గ్యారేజ్ ఛక్, డొమెణ కూడలి, సీఆర్‌పీ ఛక్ పరిసరాల్లో వాహనాల తనిఖీ కట్టుదిట్టంగా నిర్వహిస్తున్నారు. రాత్రి అంతా తనిఖీలు నిరవధికంగా కొనసాగిస్తున్నారు. పరిసర ప్రాంతాల ఠాణా పోలీసు అధికారులు, జోనల్ ఏసీపీలు, నగర డీసీపీ ప్రత్యక్షంగా ఈ చర్యల్ని పర్యవేక్షిస్తున్నారు.



ద్విచక్ర వాహనచోదకులతో మాట్లాడుతున్న పోలీసులు



రాత్రివేళ తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

బీజేడీతో కలవం

- బీజేపీ ఒంటరిగానే పోటీ చేస్తుంది
- కేంద్ర మంత్రి అర్జున్ ముండా స్పష్టీకరణ



అర్జున్ ముండా, కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రి

భువనేశ్వర్: త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో భారతీయ జనతా పార్టీ (బీజేపీ), బిజూ జనతాదళ్ (బీజేడీ) మధ్య పొత్తు వ్యవహారాన్ని కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రి అర్జున్ ముండా స్పష్టంగా తోసిపుచ్చారు. రాష్ట్ర పర్యటనకు విచ్చేసిన సందర్భంగా ఆయన ఆదివారం ఈ విషయం వెల్లడించారు. తాజా ఎన్నికల్లో పోటీ కోసం ఈ రెండు ప్రధాన పార్టీల మధ్య పొత్తు ఉంటుందని వ్యాపించిన ఊహాగానాల పట్ల కేంద్ర మంత్రి ఇలా స్పందించడం విశేషం. ఇటీవల కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా రాష్ట్ర పర్యటనకు విచ్చేసిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్‌తో స్నేహపూర్వకంగా మెలగడం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పాలనపట్ల ఒకరితో ఒకరు పోటాపోటీగా పొగడ్తలు గుప్పించిన నేపథ్యంలో సార్వత్రిక ఎన్నికల్లో బీజేడీతో బీజేపీ జట్టు కడుతుందనే ఊహాగానాలకు బీజం పడింది. తాజాగా రాష్ట్ర పర్యటనకు విచ్చేసిన కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రి అర్జున్ ముండా పొత్తు సమీకరణాల్ని నిరాకరించారు. రాష్ట్రంలో బీజేపీ, బీజేడీ మధ్య పొత్తు ఉండే అవకాశం లేదని స్పష్టం చేశారు. రెండు రాజకీయ పార్టీలు ఇప్పట్లో కానీ, సమీప భవిష్యత్తులో కానీ పొత్తు పెట్టుకోబోవని గట్టిగా ఒక్కాణించారు. గత ఎన్నికల మాదిరిగానే బీజేడీతో ఎటువంటి పొత్తు, మైత్రి, కూటమి లేకుండా బీజేపీ ఒంటరిగా ఎన్నికల్లో పోటీ చేస్తుందని తెలిపారు. ప్రజాస్వామ్య ప్రామాణికలకు ప్రాణం పోసే దిశలో నరేంద్ర మోదీ ప్రభుత్వం దేశ వ్యాప్తంగా అన్ని రాష్ట్రాల వేగవంతమైన అభివృద్ధితో దేశ సమగ్రాభివృద్ధికి నిరవధికంగా కృషి చేస్తుందని చెప్పారు. ఈ పాలన తీరు దేశ వ్యాప్తంగా ప్రజల హృదయాల్ని స్పందింప జేసిందన్నారు. ప్రాంతీయం నుంచి పార్లమెంటు వరకు మోదీ నేతృత్వంలో బీజేపీ విజయానికి ఏమాత్రం ఢోకా ఉండబోదని ధీమా వ్యక్తం చేశారు. రెండు రోజుల కిందట కేంద్ర పర్యావరణ, అటవీ శాఖ మంత్రి భూపేందర్ యాదవ్ కూడా కాషాయ పార్టీ ఒంటరిగా పోటీ చేసి రాష్ట్రంలో పూర్తి ఆధిక్యతతో ఏకైక బలమైన పార్టీగా ఒడిశాలో ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని బాహాటంగా సవాలు విసిరారు.

సంస్థాగత వ్యవహారాలు పటిష్టం..

భారతీయ జనతా పార్టీ సంస్థాగత వ్యవహారాలు పటిష్టత పుంజుకున్నాయి. తాజా రాజకీయ స్థితిగతుల దృష్ట్యా భావి పరిణామాలకు దీటుగా ఈ వ్యవహారాల కార్యాచరణ పూర్తి భిన్నంగా పార్టీ రూపొందించింది.

ఐదు ఇసుక ట్రాక్టర్ల సీజ్



ట్రాక్టర్లు

రాయగడ: ఎటువంటి అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ఐదు ట్రాక్టర్లను అదనపు తహసీల్దార్ పరశురాం భత్ర శనివారం సీజ్ చేశారు. తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన ప్రియదర్శిని స్వాయి ఇసుక అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపారు. ఆమె ఆదేశాల మేరకు అదనపు తహసీల్దార్ భత్ర రాయగడ రెవెన్యూ పరిధిలోని పితామహాల్ పంచాయతీ జగన్నాథపూర్ సమీపంలో నాగావళి నది నుంచి ఇసుకను కొందరు ట్రాక్టర్ల ద్వారా అక్రమంగా రవాణా చేస్తున్నట్లు గుర్తించారు. తనిఖీ చేయగా అనుమతి పత్రాలు లేకపోవడంతో ట్రాక్టరుకు రూ.15 వేల జరిమానా విధించారు. నాగావళి నది వద్ద లోడింగ్‌కు సిద్ధంగా ఉన్న మరో మూడు ట్రాక్టర్లకు రూ.12 వేల చొప్పున జరిమానా విధించారు. ఇకపై దాడులు మరింత ముమ్మరం చేస్తామని తహసీల్దార్ ప్రియదర్శిని ప్రకటించారు.

దిగుబడిలో కొత్త ఒరవడి సృష్టించండి



వార్షిక సంచికను విడుదల చేస్తున్న డైరెక్టర్ జగదీష్ పండ, రావు, శర్మ

- జీఐఈటీ విశ్వవిద్యాలయం డైరెక్టర్ జగదీష్ పండ



హాజరైన వ్యవసాయ విభాగ విద్యార్థులు

రాయగడ: వ్యవసాయ రంగంలో విద్యార్థులు కొత్త ఒరవడిని సృష్టించి అధిక దిగుబడులు వచ్చేలా కృషి చేయాలని గాంధీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ (జీఐఈటీ) విశ్వ విద్యాలయం డైరెక్టర్ డాక్టర్ జగదీష్ పండ పిలుపునిచ్చారు. విశ్వవిద్యాలయంలో అగ్రికల్చర్ విభాగం ఏర్పాటై ఆరేళ్లు పూర్తయిన నేపథ్యంలో శనివారం సాయంత్రం నిర్వహించిన వార్షికోత్సవ సభలో ఆయన ప్రసంగించారు. కళాశాలలో నేర్చుకున్న మెలకువలను ఉపయోగించి వ్యవసాయాభివృద్ధికి విద్యార్థులు పాటుపడాలన్నారు. రైతుల సంక్షేమానికి ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తోందని, వాటిని సద్వినియోగ పరుచుకునేలా రైతులను చైతన్యం చేయాలన్నారు. ప్రపంచంలో మనదేశం వ్యవసాయ రంగంలో ప్రత్యేక స్థానం సంపాదించేలా కృషి చేయాలన్నారు. సరైన అవగాహన లేకపోవడంతో ఈ రంగం ముందుకు వెళ్లలేకపోతోందని, ఈ స్థితిని మార్చాలని వర్సిటీ అధ్యక్షుడు డాక్టర్ సత్యప్రకాష్ పండ ఆకాంక్షించారు. వ్యవసాయ రంగంపై యువత ఆసక్తి కనబరచాలన్నారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ సంతోష్ కుమార్ పండ, రిజిస్ట్రార్ డాక్టర్ ఎస్.వి.జె. రావు, కులపతి డాక్టర్ ఎ.వి.ఎస్.శర్మ తదితరులు ప్రసంగించారు. అనంతరం వార్షిక సంచికను విడుదల చేశారు.

మహిళల ఆర్థిక స్వావలంబనే లక్ష్యం



హాజరైన స్వయం సహాయక సంఘ మహిళలు



మాట్లాడుతున్న బిచిత్రా నంద బెబర్తా

పర్లాకిమిడి:

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మిషన్ శక్తి, స్వయం సహాయక మహిళా గ్రూపులు, మిల్లెట్స్ మిషన్ కేఫ్‌ల ద్వారా మహిళా స్వశక్తీకరణ, స్వయం ఉపాధి సాధ్యమవుతుందని ఏక్తా ట్రస్టు వ్యవస్థాపకురాలు దీప్తీ రేఖా పట్నాయక్ అన్నారు. స్థానిక రోటరీ సామాజిక భవనంలో ఆదివారం వర్క్‌షాపును ప్రారంభించారు. ఏక్తా ట్రస్టు సౌన్యంతో సొసైటీ, కమ్యూనిటీ డెవలప్‌మెంట్ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఈ శిక్షణ ఏర్పాటు చేశారు. కాశీనగర్, పర్లాకిమిడికి చెందిన స్వయం సహాయక గ్రూపుల మహిళా సభ్యులకు స్వయం ఉపాధి సాధించేలా ప్రత్యేక శిక్షణ ఇస్తారు. కార్యక్రమంలో రబి మహారాణా, ఒడిశా సాహిత్య అకాడమీ సభ్యులు బిచిత్రానంద బెబర్తా, జోన్న సుభాష్ చంద్రరావు, కోట్ల యువరాజ్, భాగవత్ పాఢి, ఎస్‌సీడీఓ ఎన్జీఓ సంస్థ అధ్యక్షుడు సునీల్ పట్నాయిక్ పాల్గొన్నారు.

కారు.. దిగిపోతున్నారు!

- బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరేందుకు సిద్ధమవుతున్న కొరాపుట్ నేతలు
- సంకేతాలు ఇచ్చిన మాజీ సీఎం గిరిధర్ కుటుంబం



తెలంగాణా ముఖ్యమంత్రి కేసీఆర్‌తో బీఆర్ఎస్ పార్టీలో చేరే సమయంలో గిరిధర్, శిశిర్ గమాంగ్(ఫైల్)



కొరాపుట్ మాజీ ఎంపీ జయరాం పంగి



బీజేపీలో చేరే సమయంలో ప్రధాని నరేంద్ర మోదీతో గిరిధర్

కొరాపుట్/జయపురం : భారతీయ రాష్ట్ర సమితి(బీఆర్ఎస్) పార్టీని కొరాపుట్ జిల్లా నేతలు వీడనున్నారు. ఒడిశా రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి గిరిధర్ కుటుంబం ఆ పార్టీని వీడుతున్నట్లు సంకేతాలు ఇచ్చారు. ఈ మేరకు గిరిధర్ గమాంగ్ కుమారుడు శిశిర్ గమాంగ్ (మిట్టు) న్యూఢిల్లీలోని ఇండియా గేట్ వద్ద నుంచి ఓ వీడియో విడుదల చేశారు. తమ కుటుంబం కాంగ్రెస్ అధిష్టానంతో జరిపిన తొలి విడత చర్చలు విజయవంతంగా ముగిశాయన్నారు. గత ఏడాది తెలంగాణ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కె.చంద్రశేఖర్‌రావు సమక్షంలో హైదరాబాద్‌లో గమాంగ్ కుటుంబం ఆ పార్టీలో చేరింది. అదే వేదికపై కొరాపుట్ మాజీ ఎంపీ జయరాం పంగి కూడా కారు ఎక్కారు. ఆ రోజు వీరి చేరికలు దేశ వ్యాప్తంగా బీఆర్ఎస్ మీద అంచనాలు పెంచాయి. గిరిధర్ గమాంగ్ తొమ్మిది సార్లు కొరాపుట్ ఎంపీగా, ఒడిశా రాష్ట్ర ముఖ్యమంత్రిగా, కాంగ్రెస్ కేంద్రంలో అధికారంలో ఉన్న ప్రతిసారీ కేంద్ర కేబినెట్ మంత్రిగా పని చేశారు. గిరిధర్ భార్య హేమావతి గమాంగ్ కూడా కొరాపుట్ ఎంపీగా పని చేశారు. అటువంటి గమాంగ్ కుటుంబం 2015లో కాంగ్రెస్ పార్టీని వదిలి తొలుత బీజేపీలో చేరారు.ఆ పార్టీ అధికారంలో ఉన్నందున్న గమాంగ్‌ను ఏదో ఒక రాష్ట్రానికి గవర్నర్ చేస్తారనే ప్రచారం జరిగింది. రోజులు గడుస్తున్నా ఎటువంటి పదవి లభించలేదు. దశాబ్దాలుగా పదవుల్లో ఉన్న గమాంగ్‌కు బీజేపీ రుచించలేదు. ఇదే సమయంలో కేసీఆర్ ఆకర్షించారు. అయితే రాష్ట్రంలో బీఆర్ఎస్‌ను ప్రజలు పట్టించుకోలేదు. ఇదే సమయంలో కొరాపుట్ పార్లమెంటరీ స్థానంలో కాంగ్రెస్ పార్టీ వర్గ విబేధాలు గమాంగ్‌కు కలసి వచ్చాయి. తొలి విడత చర్చలలో జాతీయ స్థాయిలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు, పార్టీ రాష్ట్ర పరిశీలకుడు చెల్లకుమార్, కొరాపుట్ ఎంపీ సప్తగిరి ఉల్క పాల్గొన్నారు. ఇదే సమయంలో కొరాపుట్ మాజీ ఎంపీ జయరాం పంగి తాను కూడా కాంగ్రెస్‌లో చేరవచ్చునని ప్రకటించారు. తన తండ్రి, మేనత్త కాంగ్రెస్ పార్టీలో ఎమ్మెల్యేలుగా పని చేశారని గుర్తు చేశారు. బిజూ పట్నాయక్ ఆశయాలతో బీజేడీలో పని చేసినట్లు తెలిపారు. అనేకసార్లు పొట్టంగి ఎమ్మెల్యేగా, రాష్ట్ర మంత్రిగా, కొరాపుట్ ఎంపీగా పని చేశానన్నారు. తాను ఎట్టి పరిస్థితుల్లోనూ బీజేడీలో చేరనన్నారు. మరోవైపు జయపురం ఎమ్మెల్యే తారా ప్రసాద్ భాహీనీ పతి మాట్లాడుతూ గమాంగ్ కుటుంబం ఎనిమిదేళ్ల తర్వాత కాంగ్రెస్ పార్టీలోనికి వస్తుండం హర్షనీయమన్నారు. తాము గతంలో శత్రువులైనప్పటికీ రాజకీయాల్లో శాశ్వత శత్రువులు, శాశ్వత మిత్రులు ఉండరన్నారు. వీటన్నింటినీ పరిశీలిస్తే కొరాపుట్, రాయగడ జిల్లాల్లో బీఆర్ఎస్ పార్టీ ఖాళీ అయినట్లే.

న్యూస్‌రీల్

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ



మొక్కలు నాటిన సీవా సభ్యులు

జయపురం: జయపురం స్వచ్ఛంద సంస్థ సోషియల్ ఎన్విరాన్‌మెంటల్ ఎడ్యుకేషనల్ వెల్‌ఫేర్ అసోసియేషన్(సీవా) మహిళా గ్రూపు ఆధ్వర్యంలో ఆదివారం జయపురం సమితి జాముండ గ్రామ పంచాయతీలో 7వ వృక్షరోపన కార్యక్రమం నిర్వహించారు. ఉద్యానవన విభాగ అధికారి, సీవా సభ్యులు జి.వెంకటరెడ్డి పర్యవేక్షణలో సీవా మహిళ విభాగ అధ్యక్షురాలు సుమన్ ఆనంద ముంద్ర మొక్క నాటి కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. జాముండ గ్రామస్తులకు మామిడి, పనస, నిమ్మ, బొప్పాయి తదితర వందకుపైగా మొక్కలు పంపిణీ చేసి నాటించారు. సంరక్షించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీవా సంస్థ సభ్యులు మురళీ కృష్ణ పట్నాయక్, మమతా మహాపాత్రో, ప్రదీప్ సాహు, శుభస్మిత శాంత్ర, రంజిత నాయక్, అనుపమ నాయక్, పిల్లు దాస్, మమతాంజలి పాత్రో, కె.మోహనరావు, కె.దివ్య, లిపిక పాత్రో, సుధాకర పట్నాయక్, సంధ్యారాణి పట్నాయక్, బి.నళినీకుమార్, బినాయక మహాపాత్రో, మధుస్మిత మహాపాత్రో, అశోక్ చౌదురి, ఆనంద ముంద్ర తదితరులు పాల్గొన్నారు.

120 కిలోల గంజాయి స్వాధీనం


- ఇద్దరు అరెస్టు



స్వాధీనం చేసుకున్న గంజాయితో బరంపురం ఎక్సైజ్ అధికారులు

బరంపురం : బరంపురం నగరానికి కారులో అక్రమంగా రవాణా చేస్తున్న 120 కిలోల గంజాయిని బరంపురం ఎక్సైజ్ కొవిదందా విభాగం స్వాధీనం చేసుకుంది. ఈ ఘటనలో మహారాష్ట్రకు చెందిన ఇద్దరిని అరెస్టు చేశారు. ఐఐసీ అధికారి గీతాంజాలి సాహు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం ఉదయం కొంధమాల్ జిల్లా దరింగబడి నుంచి బరంపురం నగరానికి కారులో అక్రమంగా గంజాయిని తరలిస్తుండగా ముందస్తు సమాచారం మేరకు బరంపురం ఎక్సైజ్ కొవిదందా విభాగం సిబ్బంది నగర శివారులోని ఫస్ట్‌గేట్ జంక్షన్ వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. అనుమానిత కారును సోదా చేయగా 120 కిలోల గంజాయి బయటపడింది. గంజాయి, కారును స్వాధీనం చేసుకున్నారు. మహారాష్ట్రకు చెందిన హుమాస్ మహబత్, సాహిద్ సకీల్‌లను అరెస్టు చేశారు. పట్టుబడిన గంజాయి విలువ రూ.12 లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు.

10 అడుగుల కొండచిలువ కలకలం



కొండచిలువను పట్టుకున్న హరాష్ పాఢి

బరంపురం : గంజాం, బుగడా బ్లాక్‌లో 10 అడుగుల కొండచిలువ కలకలం కృష్టించింది. ఆదివారం వేకువజామున 4 గంటల సమయంలో గంజాం జిల్లా బుగడా బ్లాక్ పరిధిలోని బోనపల్లి గ్రామంలో పార్వతి గౌడా సొంత దుకాణం తెరిచి లోనికి వెళ్లగా లోపల భారీగా కొండచిలువ కనిపించింది. భయాందోళన చెందిన స్థానికులకు చెప్పగా.. వారు బంజనగర్ సబ్ డివిజన్ అటవీ విభాగానికి సమాచారం అందించారు. అటవీ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని స్నేక్ హెల్ప్‌లైన్ సభ్యుడు హరాష్ పాఢి సాయంతో కొండచిలువను పట్టుకున్నారు. అనంతరం సింహాసిని అటవీ ప్రాంతంలో విడిచిపెట్టారు. దీంతో గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు.

క్లుప్తంగా

మందుబాబులకు జరిమానా



లంజిపల్లి బైపాస్ రోడ్‌లో తనిఖీలు చేపడుతున్న పోలీసులు

బరంపురం : బరంపురం పోలీసు జిల్లా ఆధ్వర్యంలో ఎస్పీ సర్వన్ వివేక్ ఆదేశాల మేరకు మందుబాబులపై పోలీసులు కొరఢా ఝులిపించారు. శనివారం రాత్రి పలు ప్రాంతాల్లో వాహనాల తనిఖీ చేపట్టి మద్యం తాగి వాహనాలు నడుపుతున్న వారికి జరిమానాలు విధించారు. ద్విచక్ర వాహనాలు, కార్లు ఆపి మద్యం యంత్రంతో పరీక్షించారు. సరైన ధ్రువ పత్రాలు లేనివారిని గుర్తించారు. మొత్తం 156 మంది వాహనచోదకులకు రూ.2,03,150 జరిమానా విధించారు. ఎటువంటి పత్రాలు లేని వాహనాలను పోలీసుస్టేషన్‌కు తరలించినట్లు ఎస్‌డీపీఓ శిబశంకర్ మహాపాత్రో తెలిపారు.

అస్సాం రైఫిల్స్ జవాన్ మృతి



నీలాచల్ పటేల్

భువనేశ్వర్: రాష్ట్రానికి చెందిన 48 – అస్సాం రైఫిల్స్ జవాన్ పెట్రోలింగ్ సమయంలో జరిగిన ప్రమాదంలో మణిపూర్‌లో మరణించారు. మృతుడు బర్‌గఢ్ జిల్లా భేడెన్ మండలం బాఘపాలి గ్రామానికి చెందిన నీలాచల్ పటేల్‌గా గుర్తించారు. ఈయన 2004లో 48 – అస్సాం రైఫిల్స్‌లో జవానుగా చేరారు. శుక్రవారం రాత్రి విధి నిర్వహణలో భాగంగా ప్రయాణిస్తున్న వాహనం ప్రమాదానికి గురికావడంతో తీవ్ర గాయాలతో ఆస్పత్రి పాలయ్యారు. చికిత్స పొందుతూ మృతి చెందారు. జవాన్ భౌతికకాయం సోమవారం స్వగ్రామానికి చేరుకునే అవకాశం ఉందని సంబంధిత వర్గాలు తెలిపాయి. కాగా, పొరుగు రాష్ట్రం జార్ఖండ్‌లో మావోయిస్టుల దాడిలో ఒడియా సీఆర్‌పీఎఫ్ జవాన్ సుశాంత్ ఖుంటియా వీర మరణం పొందిన మరుసటి రోజే పటేల్ మరణం రాష్ట్ర ప్రజల్ని తీవ్ర విచారానికి గురిచేసింది.

ముఖ్యమంత్రి సంతాపం

జవాను నీలాచల్ పటేల్ మృతి పట్ల ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ సంతాపం తెలిపారు. దేశానికి ఆయన చేసిన అమూల్యమైన త్యాగాలు నిరంతరం గుర్తుండిపోతాయని కొనియాడారు. వీర జవాన్ ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటూ అతని కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

అనాథ శవానికి అంత్యక్రియలు



కవిటి: అనాథ శవానికి అంత్యక్రియలు నిర్వహించిన పారిశుద్ధ్య కార్మికులు

కవిటి: స్థానిక వైఎస్సార్ క్రాంతిపథం కార్యాలయం ఆవరణలో శనివారం రాత్రి ముక్కి లలిత అనే అనాథ మహిళ మృతి చెందారు. ఈ విషయం తెలిసిన వెంటనే మృతురాలి బంధువులకు సమాచారం తెలిపారు. వారి నుంచి స్పందన రాకపోవడంతో స్థానికులు ఆలోచించి అంత్యక్రియలు చేసేందుకు నిర్ణయించారు. మండల కోఆప్షన్ సభ్యుడు పాండవ చంద్రశేఖర్ కొంత ఆర్థిక సాయం అందించి స్థానిక పారిశుద్ధ్య కార్మికుల సాయాన్ని తీసుకొని చివరి కార్యక్రమాలు జరిపించారు. పోలీసు సిబ్బంది కూడా సహకరించారు.

సీఆర్‌పీఎఫ్ జవాన్ల బైకు ర్యాలీ



ఆజాదీకా అమృత్ మహోత్సవాలు పురస్కరించుకుని స్థానిక సీఆర్‌పీఎఫ్ నాలుగో బెటాలియన్ జవాన్లు ఆదివారం జాతీయ పతాకాలను చేతపట్టి బైక్ ర్యాలీ నిర్వహించారు. రైల్వేస్టేషన్ నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీ పురవీధుల్లో గుండా సాగింది. భారతమాతకు జై అంటూ నినాదాలు మారుమోగాయి.

- రాయగడ

ఇంటింటా త్రివర్ణం



స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా ఇంటింటా త్రివర్ణ (పతాకం) నినాదంతో రూపొందించిన సైకత శిల్పం పర్యాటకులు, సందర్శకుల్ని విశేషంగా ఆకట్టుకుంటుంది. భారత ప్రభుత్వం పిలుపు మేరకు మువ్వన్నెల జాతీయ పతాకం ప్రతి ఇంటా రెపరెపలాడాలని హర్ ఘర్ తిరంగా నినాదంతో సుదర్శన్ పట్నాయక్ శిష్య బృందం పూరీ సాగర తీరంలో దీనిని అందంగా తీర్చిదిద్దారు.

-భువనేశ్వర్/పూరీ

స్వాతంత్ర్య పోరాటంలో తెలుగుతేజాలు

జయపురం: దేశ స్వాతంత్ర్య పోరాటంలో కొరాపుట్ జిల్లాకు ప్రత్యేక స్థానం ఉంది. తూర్పు కనుమల నడుమ వివిధ ఆదివాసీ తెగలకు ఆలవాలమైన కొరాపుట్‌లో పపడహండి తురి నది ఒడ్డున జరిగిన గిరిజన దేశభక్తుల ఊచకోత జలియన్‌వాలాబాగ్ సంఘటనను తలపిస్తుంది. ఆంధ్రాలో తెలుగువీరుడు అల్లూరి సీతారామరాజును గుర్తు చేసే లక్ష్మణ నాయిక్ గాంధీ పిలుపునకు ఆకర్షితులూవి మారుమూల గ్రామాల్లో ఆదివాసీలను స్వాతంత్ర్య పోరాటం వైపు నడిపి మత్తిలి పోలీసుస్టేషన్ ముట్టడించారు. పోలీసుల అమానుష కాల్పులు చరిత్ర పుటలలో లిఖించబడ్డాయి. ఈ పోరాటాలలో గిరిజనులు, వారిని ఉద్యమాలు వైపు నడిపించిన నాయకుల్లో తెలుగుపోరాట వీరులు ఎంతోమంది ఉన్నారు. వారిలో జి.అన్నాజీరావు, అంగజాల వెంకటేశ్వర్లు, శివప్రసాద్ ఆచారి, కాంతారావు పట్నాయక్, చిరు ప్రాయంలో తండ్రి వెంట జెండా పట్టుకొని నడచిన డాక్టర్ జి.సూర్యారావు, గోపాలరావు పట్నాయక్, సుబ్బారావు శాస్త్రిలను ప్రముఖంగా పేర్కొనవచ్చు. జాతిపిత మహాత్మా గాంధీ ఇచ్చిన సహాయ నిరాకరణ పిలుపు మేరకు కొరాపుట్ జిల్లా నవరంగపూర్‌లో జి.అన్నాజీరావు సత్యాగ్రహం చేశారు. 1942లో భారత్ ఛఢో ఆందోళనలో ప్రధాన పాత్ర పోషించడంతో ఆంగ్లేయులు పట్టుకున్నారు. కోర్టు అతడికి నాలుగేళ్ల శిక్ష విధిస్తూ జరిమానా విధించారు. జరిమానా కట్టేందుకు అంగీకరించని అన్నాజీరావు మరికొంత కాలం జైలులోనే గడిపారు. తప్పు చేసినట్లు మాత్రం అంగీకరించలేదు. అనంతరం నవరంగపూర్ పట్టణ కాంగ్రెస్ బాధ్యతలు చేపట్టి గాంధీ సందేశాలను, కొరాపుట్ కాంగ్రెస్ నిర్ణయాలను సైక్లోస్టైల్ మిషన్‌తో పేపరుపై ముద్రించి వాటిని స్వాతంత్ర్య ఉద్యమకారులకు చేరవేసేవారు. ఆనాడు ఆంగ్లేయ పాలకులు కాంగ్రెసు కార్యాలయాలు, వారి కార్యకలాపాలపై నిషేధం విధించడంతో అన్నాజీరావు అజ్ఞాతంలో ఉండి ఉద్యమాలకు ఊపిరి అందించారు. ఆ సమరంలో తన కుమారుడు సూర్యారావుతో పాటు కుటుంబ సభ్యులందరినీ మమేకం చేశారు. ఆ కోవలో మరో స్వాతంత్ర్య యోధుడు అంగజాల వేంకటేశ్వరరావు. ఆయన జయపురంలో గాంధీ ఆశయాలను ప్రజల్లో ప్రచారం చేస్తూ ఆంగ్లేయ పాలకులకు వ్యతిరేకంగా శాంతియుత పోరాటం జరిపారు. పలుమార్లు జైలు జీవితం గడిపిన వేంకటేశ్వరయ్యన్ను కొరాపుట్ గాంధీగా పిలిచేవారు. ఆయన స్వాతంత్ర్య ఉద్యమంలో వి.వి.గిరి, ఆచార్య రంగా లాంటి జాతీయ నాయకులతో సంబంధాలు నెలకొల్పారు. ఆయన శేషజీవితం జయపురంలోనే గడిపారు. ఏ ఉద్యమానికైనా ప్రచార సాధనాలు కీలకం. ఆనాడు ముద్రణా యంత్రాలు అంతగా లేకపోవటం వల్ల సైక్లోస్టైల్ మిషన్ ప్రింటింగ్‌పైనే ఆధార పడే వారు. మహాత్ముని సందేశాలు, ప్రముఖ జాతీయ నేతల ప్రసంగాలు, జిల్లాలో ఉద్యమాల వివరాలను ప్రజలకు, ఉద్యమ కారులకు అందజేసే బాధ్యత చేపట్టి ఆంగ్లేయుల ఆగ్రహానికి గురైన మరో స్వాతంత్ర్య ఉద్యమకారుడు శివప్రసాద్ ఆచారి. ఆయన నేడు కొత్తవీధిగా పిలిచే అప్పటి పుల్లా రెడ్డిపేటలో నివాసముండేవారు. ఉద్యమల వార్తలను చేరవేస్తూ ఆంగ్లేయులకు కంతకంగా మారారు. 1943 సెప్టెంబర్ 1న అతడి ఇంటిపై పోలీసులు దాడి జరిపి సైక్లోస్టైల్ మిషన్ ప్రింటింగ్ మిషన్ ధ్వంసం చేసి ఆచారిని అరెస్టు చేశారు. 8 నెలల కారాగార శిక్ష అనుభవించి తిరిగి వచ్చిన శివప్రసాద్ కొరాపుట్ జిల్లా స్వాతంత్ర్య ఉద్యమంలో ప్రముఖ వార్తావరునిగా నిలిచారు. ఆయన తన శేషజీవితాన్ని కటిక దారిద్ర్యంతో గడపడం విషాదం. అలాగే కొట్‌పాడ్‌లో గోపాల రావు పట్నాయక్ ఉద్యమం పాల్గొని పలుమార్లు జైలు జీవితం గడిపారు. వీరేకాకుండా ఎంతో మంది తెలుగు వారు స్వాతంత్ర్య సమరంలో కీలకపాత్రం పోషించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం



ప్రమాద స్థలం వద్ద మృతదేహం



రాస్తారోకో నిర్వహిస్తున్న గ్రామస్తులు, బంధువులు



బాలేశ్వర్ నాయక్ (ఫైల్)

రాయగడ: గుర్తు తెలియని ఢీకొని యువకుడు దుర్మరణం పాలయ్యాడు. ఈ ఘటన ఆదివారం కాసీపూర్ సమితి డొంగాశిలి పంచాయతీ పండకపాడొరా కూడలిలో చోటుచేసుకుంది. మృతుడు అదే పంచాయతీలొని తుజేర్ గ్రామానికి చెందిన బాలేశ్వర్ నాయక్ (27)గా పోలీసులు గుర్తించారు. వివరాల్లోకి వెళితే .. ఆదివారం మధ్యాహ్నం రెండు గంటల ప్రాంతంలో తన సొంత బైకుపై ఓ కంపెనీలో విధులను నిర్వహించేందుకు వెళుతున్న నాయక్‌ను పండకపాడొరా కూడలి వద్ద ఎదురుగా వస్తున్న గుర్తు తెలియని వాహనం బలంగా ఢీకొంది. ఈ ఘటనలో నాయక్ కింద పడిపోవడంతో తలకు బలమైన గాయం తగిలి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. స్థానికులు స్పందించి అంబులెన్స్ సహాయంతో టికిరిలోని ఉషాపాడు ఆస్పత్రికి తరలించారు. అప్పటికే నాయక్ మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. విషయం తెలుసుకున్న కుటుంబీకులు , గ్రామస్తులు నాయక్ మృతదేహన్ని పట్టుకుని పండకపాడొరా రోడ్డు వద్ద రాస్తారోకో చేపట్టారు. డ్రైవర్‌ను పట్టుకోవడంతో పాటు కుటుంబానికి నష్టపరిహారం చెల్లించాలంటూ సుమారు 5 గంటల పాటు ఆందోళన చేపట్టారు. విషయం తెలుసుకున్న దొరాగుడ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని నచ్చజెప్పడంతో ఆందోళన విరమించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు .

రాష్ట్రానికి రెండు రైల్వే ప్రాజెక్టులు

- నేషనల్ ప్లానింగ్ గ్రూప్ సిఫారసు కింద నిధుల కేటాయింపు



భువనేశ్వర్: నేషనల్ ప్లానింగ్ గ్రూప్ (ఎన్‌పీజీ) గతి శక్తి కార్యక్రమం కింద రాష్ట్రానికి రెండు రైల్వే ప్రాజెక్టుల్ని ఆమోదించి నిధులు కేటాయించింది. సామాజిక, ఆర్థిక అభివృద్ధికి మల్టీమోడల్ కనెక్టివిటీని కలిగించే దృక్పథంతో ఈ ప్రాజెక్టులు మంజూరు చేయడం విశేషం. ఇవి భవిష్యత్ సామర్థ్యం పెంపొందించడంలో వారధిగా నిలుస్తాయి. ప్రాజెక్టుల రద్దీ, అధిక జనాభా ఉన్న ప్రాంతాల్ని వివిధ గ్రామాలు, కీలకమైన పారిశ్రామిక, వ్యాపార కేంద్రాలకు అనుసంధాన రవాణా సౌకర్యాల్ని కల్పిస్తాయి. దీంతో మారుమూల ప్రాంతాల్లో రాకపోకల వ్యయప్రయాసలు గణనీయంగా తగ్గుతాయి. స్థానికులకు ఉపాధి అవకాశాలు మెరుగవుతాయి.

- బర్బిల్– నయాగడ్– బర్సువాన్, అదే విధంగా భద్రసాహి – కిరిబురు రైల్వే ప్రాజెక్ట్ వ్యయ ప్రణాళిక అంచనా రూ.12,532.87 కోట్లు. గతి శక్తి మార్గదర్శకాల మేరకు ఆగ్నేయ రైల్వే బర్బిల్, బర్సువాన్–కిరిబురు, ఈస్ట్ కోస్ట్ రైల్వేలోని నయాగడ్ స్టేషన్‌లను కలుపుతుంది. ఈ రైలు మార్గం అనుసంధానం రాష్ట్రంలో సుందర్‌ఘడ్, కెంజొహర్ జిల్లాలు, జార్ఖండ్‌లోని పశ్చిమ సింగ్‌భూమ్ జిల్లాల ప్రధాన గనుల ప్రాంతాలను కలుపుతుంది.
- రూ.3,591.76 కోట్ల అంచనా వ్యయంతో ఒడిశా, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ మీదుగా ప్రతిపాదిత మల్కాన్‌గిరి నుంచి భద్రాచలం రైలుమార్గం పురోగతికి ప్రతిపాదించారు. దక్షిణ మధ్య రైల్వే (పాండురంగాపురం) నుంచి ఈస్ట్ కోస్ట్ రైల్వే (జునాగఢ్)ని కలుపుతూ కొత్త కారిడార్‌ను ఆవిష్కరిస్తుంది. ఇది ఆంధ్రప్రదేశ్‌లో సముద్ర ఓడరేవులు, మధ్య దక్షిణ ఒడిశాలో గనులు, పారిశ్రామిక ప్రాంతాల మధ్య దూరాన్ని తగ్గిస్తుందని భావిస్తున్నారు.

శ్రీముఖలింగేశ్వరుని సన్నిధిలో జిల్లా జడ్జి



స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తోన్న జడ్జి దంపతులు

జలుమూరు: ప్రసిద్ధ శైవక్షేత్రం శ్రీముఖలింగంలో వెలసిన మధుకేశ్వరుని ఆదివారం ఎస్సీ, ఎస్టీ కోర్టు జిల్లా జడ్జి సింగులూరి మహేందర్ ఫణికుమార్ దంపతులు దర్శించుకున్నారు. ముందుగా గణపతి పూజతో ప్రారంభించి ఏక వార అభిషేకాలు, అర్చనలు, దర్శనాలు చేయించారు. అనంతరం వారిహి అమ్మవారికి కుంకుమ పూజలు చేసి అర్చకులు స్వామివారి చరిత్రతోపాటు ఆలయ విశేషాలు వివరించి స్వామివారి తీర్థ ప్రసాదాలు, శేష వస్త్రాలు అందించి పుణ్యాహ వచనాలతో దీవించారు.

ఈపీఎఫ్ కనీస పెన్షన్ రూ.9 వేలు ఇవ్వాలి



మాట్లాడుతున్న అసోసియేషన్ నేతలు

జయపురం: ఈపీఎఫ్ పెన్షన్‌దారులకు కనీస పింఛన్ రూ.9 వేలు చెల్లించాలని ఈపీఎఫ్ పెన్షనర్స్ అసోసియేషన్ కొరాపుట్ శాఖ ప్రతినిధులు డిమాండ్ చేశారు. సంఘ జిల్లా అధ్యక్షుడు నళినీ రత్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో కార్మిక నేత ప్రమోదకుమార్ మహంతి మాట్లాడుతూ ప్రస్తుతం కేవలం వెయ్యి రూపాయలు మాత్రమే అందిస్తుండటంతో ఇబ్బందులు పడుతున్నట్లు చెప్పారు. కనీసం రూ.9 వేలు చెల్లించాలని ఎప్పటి నుంచో డిమాండ్ చేస్తున్నా పాలకులు పట్టించుకోకపోవడం తగదన్నారు. గత పార్లమెంట్ సమేవేశంలో బాలేశ్వర్ బీజేడీ ఎంపీ మంజులత మండల్, డెంకానల్ బీజేడీ ఎంపీ మహేష్ సాహులు పెన్షనర్ల సమస్యలపై మాట్లాడుతూ కనీసం రూ.9 వేలు చెల్లించాలని కోరారని గుర్తు చేశారు. వెంటనే కేంద్రం అమలు చేయాలన్నారు. లేనిపక్షంలో ఆందోళన తప్పదని స్పష్టం చేశారు. సమావేశంలో సంఘ నేతలు రామ శంకర పట్నాయక్, జి.ప్రసాదరావు, ఎస్ఎస్ఆర్‌కె మూర్తి, కిశోర్ చంద్ర పండ తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం చేరిన రాజీవ్ జ్యోతియాత్ర

శ్రీకాకుళం అర్బన్: దేశంలో శాంతి స్థాపన కోస మే రాజీవ్ జ్యోతియాత్ర నిర్వహిస్తున్నామని కాంగ్రెస్ పార్టీ తమిళనాడు నాయకుడు శామ్యూల్ ది రవియమ్ అన్నారు. ఈ నెల 11న తమిళనాడు శ్రీపెరుంబుదూరులో బయల్దేరిన రాజీవ్ గాంధీ జ్యోతి యాత్ర ఆదివారం శ్రీకాకుళం నగరానికి ఆదివారం ఉదయం చేరు కుంది. ఈ సందర్భంగా శ్రీకాకుళంలోని ఇంది రా విజ్ఞాన్ భవన్‌లో డీసీసీ అధ్యక్షురాలు బొడ్డేపల్లి సత్యవతి, స్థానిక కాంగ్రెస్ నాయకులు వారికి ఘన స్వాగతం పలికారు. యాత్ర కరపత్రాన్ని ఆవిష్కరించారు.

రహదారిపై నెత్తుటి మరక

- రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి
- మరొకరికి తీవ్ర గాయాలు
- మృతుల్లో ఒకరు పూజారి, మరొకరు వంట మాస్టర్



రక్తసిక్తమైన ప్రమాద స్థలం

శ్రీకాకుళం రూరల్, ఆమదాలవలస:

రహదారి రక్తసిక్తమైంది. స్నేహితుడిని ఆస్పత్రికి తీసుకెళ్దామని బయల్దేరిన వారిని మృత్యువు మింగేసింది. శ్రీకాకుళంలోని ఆదివారంపేట వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆమదాలవలస మోణంగివారి వీధికి చెందిన మండా జగన్(27), పూజారిపేటకు చెందిన నాయుడు సత్యనారాయణ(42)లు దుర్మరణం పాలయ్యారు. శ్రీకాకుళం రూరల్ ఎస్ఐ విజయ్‌కుమార్ ఇచ్చిన వివరాల మేరకు..

జగన్ అయ్యప్ప స్వామి ఆలయంలో అర్చకుడిగా పనిచేస్తున్నాడు. సత్యనారాయణ వంటలు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. స్నేహితుడికి కడుపు నొప్పిగా ఉండడంతో ఆస్పత్రికి తీసుకెళ్దామని ఆయనను అంబులెన్స్‌లో ఎక్కించి.. వెనుక బండిపై మరో ముగ్గురు బయల్దేరారు. ఆదివారంపేట సప్తగిరి కల్యాణ మండపం దగ్గరకు రాగానే.. శ్రీకాకుళం నుంచి ఆమదాలవలస రూట్ గుండా వెళ్లే మరో ద్విచక్ర వాహనం ఎదురెదురుగా వచ్చి వీరి వాహనాన్ని బలంగా ఢీకొట్టింది. దీంతో జగన్ అక్కడికక్కడే మృతి చెందాడు. సత్యనారాయణను ఆస్పత్రికి తీసుకెళ్తుండగా మార్గం మధ్యలో కన్నుమూశాడు. అదే బండిపై ఉన్న మరో వ్యక్తి ఈశ్వరరావుకు గాయాలయ్యాయి. అలాగే మరో వాహనంపై ఉన్న లంకాం గ్రామానికి చెందిన రుప్ప జయరాం (21), రాజు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు వెంటనే 108కు సమాచారం ఇవ్వడంతో క్షతగాత్రులను కిమ్స్ ఆస్పత్రికి తరలించారు.

మృతుల్లో మండ జగన్‌కు తండ్రి లేరు. తల్లి, చెల్లి మాత్రమే ఉన్నారు. ఆమదాలవలసలోని అయ్యప్పస్వామి ఆలయంలో పూజారిగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. మరో మృతుడు సత్యనారాయణకు వివాహమైనా విడాకులు కావడంతో తల్లి వద్దే ఉంటున్నాడు. ఈయన వంట మాస్టర్‌గా పనిచేస్తున్నారు. కుటుంబాన్ని పోషించే ఇద్దరూ మృతి చెందడంతో కుటుంబ సభ్యులు గుండెలవిసేలా రోదించారు. విషయం తెలుసుకున్న రూరల్ పోలీసులు మృతదేహాలను రిమ్స్ మార్చురీకి తరలించి కేసు నమోదుచేశారు.



మండా జగన్ (ఫైల్)



సత్యనారాయణ (ఫైల్)

సరస్వతి శిశు మందిర్‌లో విజ్ఞాన ప్రదర్శన



సైన్స్ ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న అతిథులు



నత్య ప్రదర్శనలో విద్యార్థులకు బహుమతుల ప్రదానం

రాయగడ: స్థానిక సరస్వతి శిశు మందిర్‌లో ఆదివారం సైన్స్ ఎగ్జిబిషన్ ఏర్పాటైంది. వివిధ ప్రాంతాల్లో ఉన్న ఆరు సరస్వతి శిశు మందిరాలకు చెందిన విద్యార్థులు ఈ ప్రదర్శనలో పాల్గొని ప్రాజెక్టులు ప్రదర్శించారు. ఆదర్శ విద్యాలయం ప్రిన్సిపాల్ చితం జయ బెహర ముఖ్యఅతిథిగా హాజరై ప్రదర్శన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో విజ్ఞానం పెంపొందించేందుకు ఈ తరహా ప్రదర్శనలు దోహదపడతాయని చెప్పారు. విద్యార్థులను అడిగి ప్రాజెక్టుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఆదివాసీ, సంబల్‌పురి భాషా, సంస్కృతులను అద్దం పట్టే వేషధారణలు అబ్బురపరిచాయి. విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సరస్వతి శిశుమందిర్ ప్రధానోపాధ్యాయులు రమేష్ చంద్ర సాహు, కార్యదర్శి సునీల్ ప్రసాద్ మహాపాత్రొ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా పరేడ్ సాధన



స్వాతంత్ర్య దినోత్సవం నేపథ్యంలో స్థానిక గజపతి స్టేడియంలో పరేడ్ ప్రాక్టీసు ఆదివారం ఉత్సాహంగా సాగింది. ఎస్పీ స్వాతి ఎస్.కుమార్ ఆధ్వర్యంలో 33వ పోలీసు సాయుధ బెటాలియన్, ఏపీఆర్ పోలీసు దళాలు, శ్రీకృష్ణచంద్ర గజపతి కళాశాల, ఇతర విద్యాలయాల ఎన్‌సీసీ, బాయ్ స్కౌట్స్‌లు పాల్గొని స్టేడియంలో పరేడ్ ప్రాక్టీసు చేయించారు.

పర్లాకిమిడి

పాములతో జాగ్రత్త



మాట్లాడుతున్న సుయన్ జెనా



పాల్గొన్న పారాలీగల్ స్వచ్ఛంద సేవకులు, అంగన్‌వాడీ ప్రతినిధులు

జయపురం: పాముకాటుకు గురికాకుండా అప్రమత్తంగా ఉండాలని, కాటు వేసినా ఆందోళన చెందకుండా తక్షణం వైద్యులను సంప్రదించి చికిత్స పొందాలని వక్తలు సూచించారు. కొరాపుట్ జిల్లా న్యాయ సేవా ప్రదీకరణ ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా కోర్టు ప్రాంగణంలో పాము కాటుపై అవగాహన సదస్సు నిర్వహించారు. కొరాపుట్ జిల్లా సడ్జి, జిల్లా న్యాయ సేవా ప్రదీకరణ అధ్యక్షుడు సత్యనారాయణ మిశ్రా ఆదేశాల మేరకు జిల్లా జడ్జితో పాటు లోక్ అదాలత్ శాశ్వత జడ్జి సుమన్ జెనా పర్యవేక్షణలో జరిగిన ఈ సదస్సులో.. పాము కాటు వేయకుండా రక్షణ, ప్రాథమిక వైద్యం తదితర అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో జడ్జి శంతున్‌కుమార్ దాస్, రిజిస్ట్రార్, ప్రధాన మెజిస్ట్రేట్ (మైనర్ న్యాయ బోర్డ్) బిష్ణు ప్రసాద్ దేవత, జిల్లా ప్రధాన వైద్యాధికారి డాక్టర్ అరుణకుమార్ పాఢీ, జిల్లా న్యాయవాదుల సంఘు అధ్యక్షుడు బిరేష్ పట్నాయక్, వైల్డ్ యానిమల్ రెస్క్యూ టీమ్ ఆన్ ఎన్విరాన్‌మెంటల్ అవేర్‌నెస్ అండ్ మేనేజ్‌మెంట్ ప్రతినిధి కృష్ణ కేశవ షోడంగి, జిల్లా ఎమర్జెన్సీ విభాగ అధికారి నూతన కుమార్ సాగరియ, జయపురం అటవీ విభాగ డిప్యూటీ రేంజర్, అటవీ సిబ్బంది, న్యాయవాదులు, 250 మందికి పైగా పారాలీగల్ స్వచ్ఛంద సేవకులు, అంగన్‌వాడీ, ఆశా వర్కర్లు, స్వయం సహాయక గ్రూపుల సభ్యులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వ్యక్తి అదృశ్యం


చందక రామారావు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని తంగుడుబిల్లి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి అదృశ్యం కావడంతో కుటుంబసభ్యులు ఆదివారం ఫిర్యాదు చేశారు. వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన చందక రామారావు ఈ నెల 12న విజయనగరం ఆస్పత్రికి వెళ్లి వస్తానని చెప్పి బయటకు వెళ్లాడు. ఇంతవరకూ ఇంటికి రాకపోవడంతో బంధువుల ఇళ్లలోనూ, వివిధ ప్రాంతాల్లోనూ వెతికినా ఆచూకీ లభ్యం కాకపోవడంతో నెల్లిమర్ల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

డ్రైవర్ల సంఘం జిల్లా అధ్యక్షుడిగా అప్పలనాయుడు

విజయనగరం క్రైమ్: ప్రభుత్వ డ్రైవర్ల సంఘం జిల్లా అధ్యక్షుడిగా ఎ.అప్పలనాయుడిని ఏకగ్రీవంగా ఎంపిక చేసినట్లు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ వాహన డ్రైవర్ల సంఘం జిల్లా ప్రతినిధులు ఆదివారం తెలిపారు. ఎంపికైన అప్పలనాయుడు మూడేళ్ల పాటు పదవిలో కొనసాగుతారన్నారు. ఎన్నికల అధికారులుగా కె.చిరంజీవి, కేవీ.రమణమూర్తి వ్యవహరించారు. కార్యక్రమంలో పాల్గొన్న సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసరావు, రాష్ట్ర గౌరవాధ్యక్షుడు కొండయ్య, గౌరవ సలహాదారు యండమూరి నాగరాజు తదితరులు నూతన అధ్యక్షుడికి అభినందనలు తెలిపారు.


భవనంపై నుంచి పడి వ్యక్తి మృతి

బొబ్బిలి: పట్టణంలోని పాత కోర్టు భవనం ఎదురుగా ఉన్న సామిల్లులో పనిచేస్తున్న శ్రీకాకుళం జిల్లా పాలవలసకు చెందిన దుమ్ము దుర్వాసులు(58) నిర్మాణంలో ఉన్న భవనంపై నుంచి ప్రమాదవశాత్తు కింద పడి మృతి చెందినట్లు ఎస్సై చదలవాడ సత్యనారాయణ విలేకరులకు తెలిపారు. దుర్వాసులు ఎనిమిది నెలలుగా ఇక్కడ పనిచేస్తూ సహచరులతో కలిసి ఉంటున్నాడు. ఈ క్రమంలో శనివారం రాత్రి గాలికోసం సమీపంలో గల నిర్మాణ భవనంపైకి వెళ్లగా ప్రమాదవశాత్తు తూలి కింద పడిపోయి అక్కడికక్కడే మృతి చెందినట్లు ప్రాథమిక దర్యాప్తులో తేలిందన్నారు. మృతుడికి భార్య కృష్ణవేణి ముగ్గురు మగ పిల్లలున్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

ఆర్టీసీ బస్సు, ఆటో ఢీ

- ఇద్దరికి తీవ్ర గాయాలు, మరో ఇద్దరికి స్వల్ప గాయాలు


వెదుళ్లనరవ సమీపంలో ఒక దాన్ని మరొకటి ఢీకొన్న ఆటో,ఆర్టీసీ బస్సులు


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

సబ్బవరం: మండలంలోని వెదుళ్లనరవ సమీపంలో అల్లిమెట్ట మలుపు వద్ద ఆర్టీసీ బస్సు ఆటోను ఢీకున్న ఘటనలో ఇద్దరు వ్యక్తులకు తీవ్ర గాయాలు కాగా మరో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. విజయనగరం జిల్లా బొండపల్లి మండలం కొత్తపాలెం గ్రామానికి చెందిన వర్రి గోపాలం(35),చల్లా శ్రీను(35),అల్లు సూరిసత్యం(52),వేమలి కృష్ణమ్మ ఆదివారం ఉదయం దువ్వాడలోని తమ బంధువుల ఇంటికి ఆటోలో శుభకార్యానికి వచ్చారు. తిరిగి స్వగ్రామం వెళ్తుండగా వెదుళ్లనరవ సమీపంలోని అల్లిమెట్ట మలుపు వద్దకు వచ్చే సరికి చోడవరం నుంచి గాజువాక వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఎదురుగా వస్తున్న ఆటోను ఢీకొట్టింది. దీంతో ఆటో వెనుక కూర్చున్న నలుగురిలో వర్రి గోపాలం,అల్లు సూరిసత్యం తలలకు తీవ్రగాయాలు కాగా మిగిలిన ఇద్దరికీ స్వల్పగాయాలయ్యాయి. దీంతో క్షతగాత్రులను స్థానికులు దువ్వాడలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా 85వ సాహితి సభ


స్వప్న హైందవిని వేగావతి బిరుదుతో సత్కరిస్తున్న సాహితిమిత్ర సభ్యులు

సాలూరు: సాహితిమిత్ర బృందం ఆధ్వర్యంలో పట్టణంలో ఉద్యోగస్తుల కమ్యూనిటీ హాల్‌నందు 85వ సాహితి సభను ఆదివారం ఘనంగా నిర్వహించారు. సభాధ్యక్షుడు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సాంస్కృతిక విభాగం నాయకుడు జర్జాపు ఈశ్వరరావు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో సంస్కృతం, తెలుగు భాషల గొప్పతనాన్ని వక్తలు వివరించారు. తెలుగు భాష అమృతమైనదని పేర్కొన్నారు. కార్యక్రమంలో భాగంగా డా.పెన్నేటి స్వప్న హైందవికు వేగావతి బిరుదును ఇచ్చి సత్కరించారు. కార్యక్రమంలో ప్రముఖులు డా.వాడాడ గణేశ్వరరావు, ఉప్పల గీత, శ్రీనివాసరావు, జేబీ తిరుమలాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

వర్ధమాన క్రికెటర్లకు ఏపీఎల్ తొలిమెట్టు

- జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి ఎంఎల్ఎన్ రాజు
- అవకాశాలను అందిపుచ్చుకోవాలి: సెట్విజ్ సీఈవో రాంగోపాల్
- ఉత్సాహంగా 3కె రన్


క్రీడాజ్యోతిని వెలిగించి 3కె రన్‌ను ప్రారంభిస్తున్న జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి రాజు, కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు ఈశ్వర్ కౌశిక్‌లు

విజయనగరం: ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 16 నుంచి 27 వరకు విశాఖలోని డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి క్రికెట్ మైదానంలో నిర్వహించే ఆంధ్ర ప్రీమియర్ లీగ్ సీజన్-2 క్రికెట్ టోర్నమెంట్ విజయవంతం చేయడంలో ప్రజలు, క్రీడాకారులు, క్రీడాభిమానులు సహకరించాలని జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి ఎంఎల్ఎన్ రాజు కోరారు. ఏపీఎల్ సీజన్-2 ప్రారంభోత్సవంలో భాగంగా జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక విజ్జీస్టేడియం నుంచి కోట జంక్షన్ వరకు మన ఆంధ్రా- మన ఏపీఎల్ నినాదంతో 3కె రన్ నిర్వహించారు. ఈ రన్‌ను స్థానిక విజ్జీ స్టేడియంలో ఎంఎల్ఎస్ రాజు, జిల్లా కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి జి.ఈశ్వర్ కౌశిక్, సెట్విజ్ సీఈఓ బి.రామ్ గోపాల్‌లు క్రీడాజ్యోతిని వెలిగించి ప్రారంభించారు. అనంతరం జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి ఎంఎల్ఎన్ రాజు మాట్లాడుతూ ఐపీఎల్ తరహాలో నిర్వహించే ఈ టోర్నీ జిల్లా క్రికెట్ క్రీడాకారులకు వరమని తెలిపారు. వారిని స్ఫూర్తిగా తీసుకుని ఎంతోమంది చిన్నారులు క్రికెట్‌లో రాణించడానికి ఉపయోగపడుతుందని ఉద్ఘాటించారు. 12 రోజుల పాటు నిర్వహించే ఏపీఎల్ చూసేందుకు ఉచితంగా ప్రవేశం కల్పించేందుకు ఈ అవకాశాన్ని క్రీడాకారులు, జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి అధ్యక్షుడు జి.ఈశ్వర్ కౌశిక్ మాట్లాడుతూ దేశంలో నిర్వహిస్తోన్న ఇండియన్ ప్రీమియల్ క్రికెట్ లీగ్ టోర్నీ ఎంతోమంది క్రికెటర్లను వెలుగులోకి తీసుకువస్తుందని ఇదే తరహాలో ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ నిర్వహించే ఏపీఎల్ రాష్ట్ర క్రీడాకారులకు, జిల్లా క్రికెటర్లకు తొలి మెట్టుగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని జిల్లా క్రికెటర్లు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. వర్ధమాన క్రికెటర్లకు ఐపీఎల్ రాజమార్గమని దానిని సద్వినియోగం చేసుకుని అవకాశాలను అందిపుచ్చుకోవాలని సెట్విజ్ సీఈవో రామ్ గోపాల్ సూచించారు.

క్రికెట్‌కు ప్రభుత్వం ప్రాముఖ్యం

జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కోట జంక్షన్ వద్ద ముగిసిన మన ఆంధ్ర మన ఏపీఎల్ 3కె రన్ ముగింపు కార్యక్రమానికి హాజరైన సెట్విజ్ సీఈఓ క్రికెట్ క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం క్రికెట్ అభివృద్ధికి అధిక ప్రాముఖ్యం ఇస్తుందని అలాగే ఐపీఎల్‌లో రాష్ట్ర జట్టు ఉండేలా ప్రణాళికలు సిద్ధం చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో నార్త్ జోన్ క్రికెట్ అకాడమీ చైర్మన్ సన్యాసి రాజు, సెలక్టర్లు బంగార్రాజు, ఎంఎస్ఎన్ వర్మ, ఎంసీఏ కోచ్ రతన్, కోచ్‌లు సురేంద్ర, రమేష్, చంద్రశేఖర్, సీనియర్ క్రీడాకారులు తపస్వి, పృథ్వీరాజ్ ఇతర క్రీడాకారులు పాల్గొన్నారు.


రన్‌లో పాల్గొన్న క్రీడాకారులు, అసోసియేషన్ ప్రతినిధులు

లైసెన్స్ లేకుండా ఎరువుల విక్రయం నేరం

- నిందితులపై 6ఎ కేసు నమోదు
- జిల్లా వ్యవసాయ అధికారి తారకరామారావు

విజయనగరం ఫోర్ట్: లైసెన్స్ లేకుండా విత్తనాలు, పురుగు మందులు, ఎరువులు విక్రయించిన వారిపై 6ఎ కేసు నమోదు చేస్తామని జిల్లా వ్యవసాయ అధికారి వి.తారకరామారావు హెచ్చరించారు. అన్ని అనుమతులు ఉన్న వారు మాత్రమే విక్రయాలు చేపట్టాలని స్పష్టం చేశారు. లైసెన్స్ లేకుండా పట్టుబడిన విత్తనాలు, ఎరువుల విలువ రూ. 5 లక్షల లోపు అయితే జేసీ కోర్టులో కేసు నమోదు చేస్తామని చెప్పారు. రూ.5లక్షలు దాటితే కోర్టులో కేసు పెడతామన్నారు. అదే విధంగా పురుగు మందులు లైసెన్స్ లేకుండా విక్రయిస్తూ పట్టుబడితే వస్తువు విలువ ఎంతైనా కోర్టులో కేసు నమోదు చేస్తామన్నారు. జిల్లాలో విత్తన షాపులు 195 ఉన్నాయని, ఎరువుల షాపులు 210 ఉన్నాయని, పురుగు మందుల దుకాణాలు 270 ఉన్నాయని తెలిపారు.


జిల్లా వ్యవసాయాధికారి రామారావు

ఆర్టీసీ డ్రైవర్ నిజాయితీ


అర్ధరాత్రి డిపో వద్ద బాధితులకు నగదు, బ్యాగ్ అప్పగిస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు, అధికారులు

పాలకొండ రూరల్: పట్టణంలోని కొత్తవీధికి చెందిన పి.దుర్గమ్మ తండ్రితో కలిసి రాజాం నుంచి శనివారం రాత్రి ఆర్టీసీ బస్సులో పాలకొండకు వస్తూ నగదు రూ.24 వేలతో కూడిన బ్యాగ్ బస్సులో పొరపాటున విడిచిపెట్టి బస్సు దిగిపోయింది. ప్రయాణికులందరూ బస్సు దిగిపోయిన అనంతరం డ్రైవర్ జీడీ రావు వాహనంతో స్థానిక డిపోకు వెళ్లిపోయారు. విధులు ముగించే సమయంలో బస్సులో ఉన్న బ్యాగ్‌ను ఆయన గుర్తించి డిపో సెక్యూరిటీకి అప్పగించాడు. బాధితురాలు తన తండ్రితో కలిసి అర్ధరాత్రి డిపోకు చేరుకుని బస్సులో బ్యాగ్ విడిచిపెట్టి దిగిపోయినట్లు అధికారులకు చెప్పగా వారి వద్ద ఉన్న బస్ టికెట్ ఆధారంగా బాధితులను సిబ్బంది గుర్తించారు. డిపో మేనేజర్ పి.వెంకటేశ్వరరావు, సహాయ మేనేజర్ ఎస్.లక్ష్మణరావు, సెక్యూరిటీ అధికారి టి.రాము, కంట్రోలర్ మజ్జి కృష్ణారావుల సమక్షంలో బాధితులకు బ్యాగ్ అందించారు. నిజాయితీగా వ్యవహరించిన డ్రైవర్‌ను ఆర్టీసీ యాజమాన్యం అభినందించింది.

బిల్డింగ్ పైనుంచి పడి భవన నిర్మాణ కార్మికుడి మృతి


మృతుడు పాకిరి నాయుడు

కూర్మన్నపాలెం : నిర్మాణంలో ఉన్న బిల్డింగ్‌పై నుంచి పడి ఓ భవన నిర్మాణ కార్మికుడు మృతి చెందిన సంఘటన దువ్వాడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. దువ్వాడ సీఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం.. విజయనగరం జిల్లా బొబ్బిలి మండలం కింతలవానిపేట గ్రామానికి చెందిన పాకిరి నాయుడు(45) భవన నిర్మాణ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. భార్య రమణమ్మ, కూతురు సీతామహాలక్ష్మి, అల్లుడు ఉమాశంకర్‌తో కలిసి కూర్మన్నపాలెంలోని కాశీపాలెంలో నివాసముంటున్నాడు. ఆదివారం కూర్మన్నపాలెం పరిధి వుడా ఫేస్-7 ద్వారకపురికాలనీలో గల గ్లోరియా స్కూల్ పక్కన ఓ ఇంటి నిర్మాణ పనుల్లో భాగంగా లిఫ్ట్‌లో మెటీరియల్‌ను తీసుకువెళ్తున్న క్రమంలో 3వ ఫ్లోర్ పై నుంచి జారి పడి అక్కడికక్కడే మృతి చెందాడు. భార్య రమణమ్మ ఫిర్యాదు మేరకు దువ్వాడ పోలీసులు మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించి, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఐటీఐ ప్రిన్సిపాల్ మానవత్వం

- గాయపడిన మహిళను ఆస్పత్రికి కారులో తరలింపు



గాయపడిన మహిళను కారులో ఆస్పత్రికి తీసుకువెళ్తున్న ప్రిన్సిపాల్ టీవీ గిరి, (ఇన్‌సెట్లో) ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మహిళ

విజయనగరం రూరల్: ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మహిళను వెనువెంటనే తన కారులో ఆస్పత్రికి తీసుకువెళ్లి ప్రాణాలు కాపాడిన విజయనగరం ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ టీవీ గిరి తన మానవత్వం చాటుకున్నారు. వివరాలిలా ఉన్నాయి. ఆదివారం మధ్యాహ్నం 12 గంటల ప్రాంతంలో విజయనగరం, విశాఖరోడ్డు రఘు ఇంజినీరింగ్ కళాశాల సమీపంలో ఐదుగురు బ్యాంకు ఉద్యోగులు నడుచుకుంటూ వెళ్తున్నారు. అయితే వారిని గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టడంతో ఒక మహిళ తలకు బలమైన గాయం తగిలి అపస్మారక స్థితికి చేరుకుంది. అదే సమయంలో విశాఖపట్నానికి కారులో వెళ్తున్న విజయనగరం ఐటీఐ ప్రిన్సిపాల్ టీవీ గిరి క్షణం ఆలస్యం చేయకుండా ప్రమాదానికి గురైన మహిళను, సహోద్యోగుల సహాయంతో తగరపువలస సమీపంలోని ఎస్ఆర్ఐ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు ఆమెకు చికిత్స చేసి ప్రాణాలు నిలిపారు. ఏమాత్రం ఆలస్యమైనా ప్రాణాలు దక్కేవి కాదని వైద్యులు చెప్పినట్లు ప్రిన్సిపాల్ టీవీ గిరి ఈ సందర్భంగా తెలిపారు. మూడేళ్ల క్రితం తన భార్య, కుమార్తె రోడ్డు ప్రమాదంలో మరణించారని, అలా మరొకరికి జరగకుండా ప్రమాదాన్ని నివారించగలిగానన్నారు. ప్రమాద విషయమై పోలీసులకు సమాచారం అందించినట్లు చెప్పారు.

ఆర్టీసీలో అప్రెంటిస్

- 9 జిల్లాల పరిధిలో ప్రభుత్వ ఐటీఐ విద్యార్థులకు అవకాశం
- 18 ట్రేడ్స్‌లో శిక్షణ
- 15వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు స్వీకరణ
- 18 నుంచి 21వ తేదీ వరకు సర్టిఫికెట్ల పరిశీన

విజయనగరం అర్బన్: సాంకేతిక (ఐటీఐ) విద్యార్హతతో అప్రెంటిస్ శిక్షణ అందించేందుకు అర్హులైన విద్యార్థుల నుంచి ఆర్టీసీ దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. ఈ మేరకు జోనల్ వర్క్‌షాప్‌లోని స్టాఫ్ ట్రైనింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.హిమబిందు ఒక ప్రకటన విడుదల చేశారు. విజయనగరం జోన్ పరిధిలోని విజయనగరం, పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం, విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు, కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి జిల్లాల్లో ఐటీఐ ఉత్తీర్ణులైన అభ్యర్థులకు నాప్ పథకం నిబంధనల మేరకు అప్రెంటిస్‌షిప్ ఇస్తారు. ప్రధానంగా డీజిల్ మెకానిక్, మోటార్ మెకానిక్, ఎలక్ట్రీషియన్, వెల్డర్, షీట్‌మెట్ వర్కర్, పెయింటర్, మెషినిస్ట్, ఫిట్టర్, డ్రాఫ్ట్స్‌మెన్ సివిల్, మిల్ రైట్ మెకానిక్ (మెకానిక్/మెకానికల్ మెయింటనెన్స్) కోర్సుల ఐటీఐ అభ్యర్థులకు మత్రమే అప్రెంటిస్ షిప్ ప్రకటించారు. 'అప్రెంటిస్‌షిప్ ఇండియా.జీటీవీ.ఐఎన్' వెబ్‌సైట్‌లో పేర్లను ఈ నెల 15వ తేదీ లోగా నమోదు చేసుకున్న అర్హులైన అభ్యర్థులను మాత్రమే పరిగణనలోకి తీసుకుంటారు. ధ్రువీకరణ పత్రాల పరిశీలన కోసం ఆన్‌లైన్‌లో నమోదైన అభ్యర్థులను జిల్లాల వారీగా పిలుస్తారు. ఈ నెల 18 నుంచి 21వ తేదీ వరకు ఆయా జిల్లాల అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన స్థానిక ఇండ్రస్టియల్ ఏరియాలోని ఆర్టీసీ జోనల్ స్టాఫ్ శిక్షణ కళాశాల ప్రాంగణంలో నిర్వహిస్తారు. ఆయా జిల్లాలకు కేటాయించిన తేదీలలో ఉదయం 10 గంటలకు హాజరుకావాలి.

పరిశీలనకు తీసుకురావాల్సిన సర్టిఫికెట్లు

ఆన్‌లైన్‌లో నమోదైన రిజిస్ట్రేషన్ ఫారం, ఎస్ఎస్‌సీ మార్క్స్‌లిస్టు, ఐటీఐ మార్క్స్ లిస్టు, కుల ధ్రువీకరణ పత్రం (ఎస్సీ, ఎస్టీ, బీసీలు) మండల కార్యాలయం నుంచి పొందిన నివాస ధ్రువీకరణ పత్రం, ఎన్‌సీసీ/స్పోర్ట్స్, ఆధార్ కార్డు, పీహెచ్‌సీ సర్టిఫికెట్, బయోడేటా ఫారం, ఎక్స్‌సర్వీస్‌మన్ ధ్రువీకరణ పత్రం, సొంత అడ్రస్ రూ.25 విలువగ స్టాంప్ అతికించిన కవర్ తీసుకువెళ్లాలి. సర్టిఫికెట్ల పరిశీలన సమయంలో ఒక సెట్ జిరాక్స్ కాపీలను కూడా తీసుకెళ్లాలి. ఒక జిల్లాలో సంబంధిత ట్రేడ్‌లో ఖాళీలు లేని పక్షంలో వేరే జిల్లాలో పని చేసేందుకు అంగీకార పత్రం సర్టిఫికెట్ల పరిశీలన సమయంలో రాసి ఇవ్వాలి. ప్రాసెసింగ్ ఫీ నిమిత్తం రూ.118 చెల్లించి రసీదు పొంది దరఖాస్తుతో జతపరచాలి. పూర్తి వివరాల కోసం సమీప ప్రభుత్వ ఐటీఐ కళాలలోగానీ, 08922-294906 నంబర్‌లో గానీ సంప్రదించాలి.

సర్టిఫికెట్ల పరిశీలన జిల్లాల వారీగా

ఈ నెల 18న తూర్పుగోదావరి, కాకినాడ, కోనసీమ జిల్లాల అభ్యర్థులకు పరిశీలన ఉంటుంది. 19న విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాలకు, 21న శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విజయనగరం జిల్లాల అభ్యర్థులకు సర్టిఫికెట్ల పరిశీలన ఉంటుంది.

ఖళీగా ఉన్న అప్రెంటిస్ షిప్ కోర్సులు .:

విజయనగరం జిల్లాలో: డీజిల్ మెకానిక్, మోటార్ మెకానిక్, ఎలక్ట్రీషియన్, వెల్డర్, పెయింటర్, మిల్ రైట్ మెకానిక్ (మెకానిక్/ మెకానికల్ మెయింటనెన్స్), మెషినిస్ట్, ఫిట్టర్, డ్రాఫ్ట్స్'మెన్ సివిల్,

శ్రీకాకుళం జిల్లా: డీజిల్ మెకానిక్, మెటార్ మెకానిక్, ఎలక్ట్రీషియన్, వెల్డర్, షీట్ మెటల్ వర్కర్

పార్వతీపురం మన్యం జిల్లా: డీజిల్ మెకానిక్, మెటార్ మెకానిక్, ఎలక్ట్రీషియన్, వెల్డర్, షీట్‌మెటల్ వర్కర్

అల్లూరి సీతారామరాజు జిల్లా: డీజిల్ మెకానిక్

తూర్పుగోదావరి, కాకినాడ, కోనసీమ, అనకాపల్లి జిల్లాలలో

డీజిల్ మెకానిక్, మెటార్ మెకానిక్, ఎలక్ట్రీషియన్, వెల్డర్ ట్రేడ్స్ ఉన్నాయి.

కలకలం రేపిన విద్యార్థినుల అదృశ్యం

- పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఆచూకీ లభ్యం
- విచారణ చేసిన డీఈఓ


కేజీబీవీలో విచారణ చేస్తున్న డీఈవో ప్రేమ్‌కుమార్, సిబ్బంది

సీతంపేట: స్థానిక కేజీబీవీలో ఇంటర్మీడియట్ ఒకేషనల్ గ్రూప్ ఎంపీహెచ్‌డబ్ల్యూ ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఇద్దరు విద్యార్థినులు శనివారం రాత్రి అదృశ్యం కావడం కలకలం రేపింది. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేయగా వారి ఆచూకీ కనుగొనడంతో అధికారులు, సిబ్బంది ఊపిరిపీల్చుకున్నారు. ఇందుకు సంబంధించి సమాచారం అందడంతో జిల్లా విద్యాశాఖాధికారి (డీఈవో) నిమ్మక ప్రేమ్‌కుమార్, సూపరెంటెండెంట్ రంగాచారి, డిప్యూటీఈవో విజయకుమారి, జీసీడీవో రోజారమణి, ఎంఈవో-2 సూర్యచంద్రరావులు వెంటనే కేజీబీవీని ఆదివారం సందర్శించి సుదీర్ఘ విచారణ చేశారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ అదృశ్యమైన విద్యార్థినుల్లో ఒకరికి జన్మదినం కావడంతో వారి బంధువులు శనివారం ఉదయం కేక్, స్వీట్లు తెచ్చి ఇచ్చేసి వెళ్లిపోయారు. శనివారం రాత్రి బర్త్‌డే జరుపుకుని రోల్‌కాల్ వరకు ఉన్న విద్యార్థినులు వాష్‌రూమ్‌కు వెళ్తామని చెప్పి పాఠశాల నుంచి వెళ్లిపోయారు. ఆదివారం ఉదయం వారిద్దరూ పాఠశాలలో లేకపోవడంతో ప్రిన్సిపాల్ రూప అధికారులకు సమాచారమిచ్చారు. అలాగే పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు వీరఘట్టం ఎస్సై వెంకటరమణ, స్థానిక ఏఎస్సై శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పోలీసులు గాలింపు చేపట్టి విద్యార్థినుల ఆచూకీ కనుగొన్నారు. వారిద్దరూ కేజీబీవీ సమీపంలో ఉన్న ఒక అమ్మాయి ఇంటివద్ద ఉన్నారు. దీంతో వారిని పోలీసులు తీసుకువచ్చి విద్యాశాఖాధికారులు, కేజీబీవీ సిబ్బంది సమక్షంలో పేరెంట్స్‌కు అప్పగించారు. డీఈవో మాట్లాడుతూ విద్యార్థినుల పట్ల సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కేజీబీవీలు అంటే క్రమశిక్షణకు నిలయాలని ఇటువంటి విద్యాసంస్థలో ఎవ్వరికీ చెప్పకుండా విద్యార్థినులు బయటకు వెళ్లారంటే సిబ్బంది బాధ్యతా రాహిత్యం స్పష్టంగా కనిపిస్తోందని అసహనం వ్యక్తం చేశారు.

హైరిస్క్ గర్భిణులకు తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ సేవలు..

- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం


వాహనంలో ఇంటికి వెళ్తున్న తల్లీబిడ్డలు

విజయనగరం ఫోర్ట్: తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాల ద్వారా ఇక నుంచి హెచ్ఆర్‌పీ(హైరిస్క్ గర్భిణి)లను ఆస్పత్రికి తీసుకువెళ్లి తిరిగి ఇంటికి చేరుస్తారు. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఫోన్ చేసిన 48 గంటలలోగా గర్భిణిని ఆస్పత్రిలో చేర్పుతారు. అదేవిధంగా తీవ్ర రక్త హీనత ఉన్న గర్భిణులు రక్తం ఎక్కించుకోవడానికి తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాలను వినియోగించుకోవచ్చు. ఆస్పత్రికి చేర్చడంతో పాటు తిరిగి ఇంటికి చేర్చుతారు. ఫోన్‌చేసిన 24 గంటల లోగా ఆస్పత్రికి చేర్చుతారు.

ప్రభుత్వ ఉత్తర్వులు అమలు

> తీవ్ర రక్తహీనత, హైరిస్క్ ఉన్న గర్భిణులను ఆస్పత్రికి చేర్చాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చాయి. వెంటనే ఆదేశాలను అమలు చేస్తాం. గర్భిణులను ఆస్పత్రికి చేర్చడం కోసం ఫోన్ 6300357573 నంబర్‌ను సంప్రదించాలి.
>
> వరుణ్ వర్మ, తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ జిల్లా మేనేజర్

జిల్లాలో 22 వాహనాలు

విజయనగరం జిల్లాలో 22 తల్లీబిడ్డ ఎక్స్ ప్రెస్ వాహనాలు ఉన్నాయి. వాటిలో ఘోషా ఆస్పత్రి పరిధిలో 11, చీపురుపల్లి 2, బొబ్బిలి సీహెచ్‌సీలో 2, గజపతినగరం సీహెచ్‌సీ1, రాజాం సీహెచ్‌సీ 1, భోగాపురం 1,బాడంగి సీహెచ్‌సీ 1, రామభద్రపురం పీహెచ్‌సీ 1, ఎస్.కోట సీహెచ్‌సీ 1, ఎల్.కోట పీహెచ్‌సీ 1 వాహనం సేవలు అందిస్తున్నాయి.

సీఏ, సీఎంఏ ఫౌండేషన్ ఫలితాల్లో జిల్లా విద్యార్థుల సత్తా



విద్యార్థులను అభినందిస్తున్న ఆర్ఎస్ అకాడమీ డైరెక్టర్ రమేష్

విజయనగరం అర్బన్: ఆల్ ఇండియా స్థాయిలో జూన్‌లో నిర్వహించిన సీఏ, సీఎంఏ ఫౌండేషన్ పరీక్ష ఫలితాల్లో ఉమ్మడి విజయనగరం జిల్లా విద్యార్థులు సత్తా చాటారు. పట్టణానికి చెందిన ఆర్ఎస్ అకాడమీ విద్యార్థులు తొలి ప్రయత్నంలోనే రెండింటిలోనూ రాణించారు. నగరానికి చెందిన కె. నందిని ప్రియ సీఎంఏ ఫౌండేషన్‌లో 400కు గాను 342 మార్కులు, సీఏ ఫౌండేషన్‌లో 252 మార్కులు.. పి.శ్రీపూజి సీఎంఏ ఫౌండేషన్‌లో 332, సీఏ ఫౌండేషన్‌లో 244 మార్కులు.. జె.సుజాత సీఎంఏ ఫౌండేషన్‌లో 308, సీఏ ఫౌండేషన్‌లో 239 మార్కులు సాధించారు. అదేవిధంగా కె.చంద్రశేఖర్ సీఎంఏ ఫౌండేషన్‌లో 288, సీఏ ఫౌండేషన్‌లో 276.. వి.సంజన సీఏ ఫౌండేషన్‌లో 237 మార్కులు సాధించారని అకాడమీ డైరెక్టర్ ఎ. రమేష్ తెలిపారు. ఈ మేరకు విద్యార్థులను ఆదివారం ప్రత్యేకంగా అభినందించారు.

కూర్మరాజుపేటలో 'వరదపాయసం'


చాపరాయి మీద పాయసం మోకాళ్లపై కూర్చొని తింటున్న భక్తులు


పాయసం తయారుచేసి అమ్మవారికి మొక్కులు చెల్లిస్తున్న భక్తులు

సాలూరు మండలం కూర్మరాజుపేట గ్రామంలో వరదపాశం ముగియగానే ఆదివారం వర్షం కురిసింది. గడిచిన నెల రోజులుగా వర్షాలు కురవక పంటలు ఎండిపోతుండడంతో వారి ఆచారం ప్రకారం స్థానిక ఆరిలోవ కొండ వద్ద కొండజాకరమ్మ వారికి వరదపాశం గ్రామస్తులు చేశారు. గ్రామంలో ఊరి జన్నతను జోగిదండి, సామాన్లు సేకరించి ఉదయం పది గంటలకు గ్రామస్తులంతా కొండ వద్దకు చేరుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించారు. గ్రామస్తులంతా తలా పిడికెడు బియ్యం వేయగా, జన్నతను పాయసం తయారు చేశారు. అమ్మవారికి నైవేద్యాన్ని సమర్పించారు. అనంతరం కొండపై చాపరాయి మీద పాయసం వేసి మోకాళ్లపై కూర్చొని అమ్మవారికి మొక్కుతూ ఆచారం ప్రకారం నాలుకతో పాయసాన్ని స్వీకరించారు. గ్రామస్తులు ఎవరింటికి వారు వెళ్లిన తరువాత వర్షం పడింది. అమ్మవారు అనుగ్రహించి వర్షం కురిపించిందని వారంతా సంబరపడ్డారు.

\- సాలూరు

బెదిరించి.. భయపెట్టి.. దోపిడీ

విజయనగరం క్రైమ్: దోపిడీలు, దొంగతనాలు కొత్త పుంతలు సంతరించుకుంటున్నాయి. చీకటి ప్రదేశంలో అదునుచూసి బెదిరించి, కత్తులు చూపించి భయపెట్టి అమాయకులను కొట్టి వారి నుంచి డబ్బులు లాక్కుంటున్నారు. టూటౌన్ పరిధిలో ఈ తరహా ఘటనలు ఆదివారం రెండు జరిగాయి. కాంపిటేటివ్ ఎగ్జామ్స్‌కు ప్రిపేర్ అవుతున్న రాకేష్, శివాజీలు స్టడీ అవర్స్ అయిన తర్వాత శనివారం రాత్రి తమ రూమ్‌కు నడుచుకుని వెళ్తున్నారు. అదును చూసిన ఇద్దరు వ్యక్తులు బైక్‌పై వచ్చి వారితో తగాదా పెట్టుకుని, డబ్బులు, మొబైల్స్ లాక్కుని పారిపోయారు. బాధితులు టూటౌన్ పోలీసులను ఆశ్రయించగా కేసునమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై ప్రసన్న తెలిపారు. అలాగే వెటర్నరీ కోర్సు సెకెండ్ ఇయర్ చదువుతున్న బాలిరాజు స్నేహితుడితో కలిసి రాత్రి 9 గంటల ప్రాంతంలో బైక్‌పై అయోధ్యా మైదానంవైపు వెళ్తుండగా ఇద్దరు వ్యక్తులు ఆపి డబ్బులు డిమాండ్ చేశారు. కత్తులు చూపించి బెదిరించి వారిని పూల్ బాగ్ వరకూ తీసుకువెళ్లారు. అక్కడ ముందుగానే ఉన్న నిందితుల సహచరులు బాలిరాజు, స్నేహితుడిని చితక్కొట్టి చంపేస్తామని బెదిరించి వెయ్యిరూపాయలు, రెండు సెల్‌ఫోన్లు, బైక్ కీ తీసుకుని పారిపోయారు. బాధితుల ఫిర్యాదు మేరకు టూటౌన్ ఎస్సై షేక్ శంకర్ కేసు నమోదుచేసి నిందితులు బత్తు, జగదీష్‌లను అరెస్టు చేశారు. మరో ఇద్దరు నిందితులు పరారీలో ఉన్నారని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.